క్లుప్తంగా

పెద్దేవంలో వలంటీర్ల రాజీనామా



తాళ్లపూడిలో ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న పెద్దేవం వలంటీర్లు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం పంచాయతీ పరిధిలోని 8 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను తాళ్లపూడిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరమణకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తాము సంక్షేమ పథకాలను నిస్వార్థంగా లబ్ధిదారులకు అందించామన్నారు. అలాంటి తమపై ఇటీవల టీడీపీ, జనసేన నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలతో మనో వేదనకు గురయ్యామన్నారు. రాజీనామా చేసిన వలంటీర్లలో సిర్రా రాజ్‌కుమార్, కె.శిరీష, తిగిరిపల్లి ఉష, గెడ్డం శివపార్వతి, జె.అనూష, కె శశికళ, జి.ప్రియాంక తదితరులు ఉన్నారు.

మాదిగల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

కొవ్వూరు: రాష్ట్రంలోని మాదిగలు భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మాజీ అధ్యక్షుడు ముప్పిడి విజయరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ కల్పించిన హక్కుల్లో ఓటు హక్కు ఎంతో విలువైనదని ఆయనన్నారు. ఎవరెన్ని ప్రలోభాలు పెట్టినా, ఒత్తిళ్లు చేసినా ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే ఓటు వేయాలని సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి మాదిగల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా మాదిగలు అందరికీ లబ్ధి చేకూరిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామ శివార్లలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన గోకర్ల ఈశ్వర్ (40) అనే వ్యక్తి మృతి చెందాడు. అతడు జీడిపప్పు ఫ్యాక్టరీలో పని చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం రాత్రి ఈశ్వర్ బైక్‌పై తాడిమళ్ల నుంచి కోరుమామిడి గ్రామం వెళుతున్నాడు. గ్రామ శివార్లలో రోడ్డు పక్కనే నడిచి వెళుతున్న చిల్లపల్లి సాయిరామ్ అనే యువకుడిని ఢీ కొట్టి బైక్‌పై నుంచి కింది పడిపోయాడు. దీంతో ఈశ్వర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. సాయిరామ్‌కు స్వల్ప గాయాలైనట్టు సమిశ్రగూడెం ఏఎస్సై ఆంజనేయులు శుక్రవారం తెలిపారు.

టీడీపీ, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్ దాఖలు

కొవ్వూరు: టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి కొవ్వూరు అసెంబ్లీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కూటమి పార్టీల శ్రేణులతో కలసి ఊరేగింపుగా స్థానిక సబ్ కలెక్టర్ ఆఫీసుకు చేరుకున్న ఆయన రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవకు నామినేషన్ పత్రాలు సమర్పించారు. టీడీపీ నేత పెండ్యాల అచ్చిబాబు, అల్లూరి విక్రమాదిత్య, ఆ పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బారాయచౌదరి, జనసేన నేత టీవీ రామారావు పాల్గొన్నారు. ర్యాలీలో రాజమహేంద్రవరం లోక్‌సభ కూటమి అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపుగా..

కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు అసెంబ్లీ అభ్యర్థిగా అరిగెల అరుణకుమారి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నుంచి ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలి వచ్చారు. కాంగ్రెస్ పార్టీ నేత గెడ్డం సాయిబాబా ప్రతిపాదించగా నామినేషన్ పత్రాన్ని సబ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవకు అందజేశారు. అలాగే లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొవ్వూరుకు చెందిన బొంతా శ్యాం రవిప్రకాష్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు.

నిడదవోలులో జనసేన అభ్యర్థి దుర్గేష్

నిడదవోలు: ఎన్‌డీఏ కూటమి తరఫున నిడదవోలు అసెంబ్లీ స్థానానికి జనసేన పార్టీ అభ్యర్థి కందుల దుర్గేష్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక యర్నగూడెం రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటరమణ నాయక్‌కు ఒక సెట్ నామినేషన్ పత్రాలు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ రాజమహేంద్రవరం లోక్‌సభ ఇన్‌చార్జి జవహర్, సినీ నిర్మాత బీవీఎస్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున సత్యప్రసాద్

నిడదవోలు: మండలంలోని సమిశ్రగూడేనికి చెందిన కస్తూరి సత్యప్రసాద్ ఇండిపెండెంట్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున నిడదవోలు అసెంబ్లీ అభ్యర్థిగా శుక్రవారం నామినేష్ వేశారు. మూడు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఆర్.వెంకటరమణకు ఆయన అందజేశారు.

కోలాహలంగా వనిత నామినేషన్

- మధ్యాహ్నం 12.20 గంటలకు ఆర్వోకు పత్రాల అందజేత
- యర్నగూడెం నుంచి గోపాలపురానికి భారీ ర్యాలీ
- వేలాదిగా తరలి వచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- జన సంద్రమైన రహదారులు



ర్యాలీగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి తానేటి వనిత నామినేషన్‌కు గోపాలపురం వెళుతున్న ఆ పార్టీ శ్రేణులు



గోపాలపురంలో ఆర్వో శివజ్యోతికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అభ్యర్థి తానేటి వనిత

దేవరపల్లి/గోపాలపురం: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శుక్రవారం గోపాలపురంలో నామినేషన్ దాఖలు చేశారు. రెండు సెట్ల నామినేషన్ పత్రాలతో పాటు బి ఫాంను మధ్యాహ్నం 12.20 గంటలకు రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మీ శివజ్యోతికి సమర్పించారు. తానేటి వనిత భర్త డాక్టర్ శ్రీనివాస్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ), రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ నల్లజర్ల మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్‌లు అభ్యర్థి వనితతో పాటు ఆర్వో ఆఫీసుకు వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు.

యర్నగూడెం నుంచి ర్యాలీగా..

శుక్రవారం ఉదయాన్నే దేవరపల్లి మండలంలోని యర్నగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో తానేటి వనిత సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలసి ఉదయం 8.30 గంటలకు భారీ ఊరేగింపుగా ఆమె నామినేషన్ దాఖలుకు గోపాలపురం బయలుదేరారు. ఈ ఊరేగింపు కృష్ణంపాలెం, ధుమంతునిగూడెం, రామన్నపాలెం, దేవరపల్లి, గొల్లగూడెం మీదుగా మధ్యాహ్నం 12.10 గంటలకు గోపాలపురంలోని రిటర్నింగ్ అధికారి ఆఫీసుకు చేరుకుంది. యర్నగూడెం నుంచి గోపాలపురం సుమారు 12 కిలోమీటర్ల మేర ఈ ర్యాలీ సాగింది. రహదారి మొత్తం జన సంద్రం కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

డమ్మీ అభ్యర్థిగా బాబాజీరావు..

వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే డమ్మీ అభ్యర్థిగా తానేటి వనిత తండ్రి, మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు నామినేషన్ దాఖలు చేశారు. మంత్రి తానేటి వనిత నామినేషన్ దాఖలు చేసిన అనంతరం బాబాజీరావు తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మీశివజ్యోతికి అందజేశారు. ఆయన తనయుడు జొన్నకూటి విజయ్‌మోహన్ కుమార్, పార్టీ నల్లజర్ల మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్‌లు నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.

దేవరపల్లిలో ఘన స్వాగతం

నామినేషన్ వేసేందుకు ఊరేగింపుగా బయలుదేరిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితకు దేవరపల్లిలో ఘన స్వాగతం లభించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. జనంతో బస్టాండ్ సెంటర్ కిక్కిరిసింది. గోపాలపురంలో పార్టీ ద్వారకాతిరుమల మండల నాయకులు గజమాలతో స్వాగతం పలికారు. దారి పొడవునా పార్టీ శ్రేణులు, అభిమానులు హారతులు పట్టి పూల వర్షం కురిపించారు. రహదారులు జనంతో కిక్కిరిసి పోయి ర్యాలీ ముందుకు సాగడానికి సమయం పట్టే పరిస్థితి ఏర్పడింది. దాంతో నామినేషన్‌కు ముహూర్తపు సమయం దాటిపోతున్నట్టు గమనించిన అభ్యర్థి తనేటి వనిత డైమండ్ జంక్షన్ వద్ద ముహూర్తం సమయం 10.45 గంటలకు నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. దేవరపల్లి–గోపాలపురం రహదారి, గోపాలపురం–కొయ్యలగూడెం, గోపాలపురం–తాళ్లపూడి రహదారులు పూర్తిగా జన సంద్రం కావడంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సవం ఏర్పడింది. నామినేషన్ ర్యాలీ కాదని, విజయోత్సవ ర్యాలీ అని పలువురు నాయకులు పేర్కొన్నారు. నాలుగు మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, మహిళలు పాల్గొన్నారు.

బుల్లెట్‌లపై బైక్ ర్యాలీగా..

నల్లజర్ల: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, హోంమంత్రి తానేటి వనిత నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం కోలాహలంగా బయలుదేరి వెళ్లాయి. ఆ పార్టీ ప్రకాశరావుపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడు ముత్తిన నరేష్, కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు ఆధ్వర్యంలో 175 బైక్‌లతో భారీ ర్యాలీ జరిగింది. ఐదుగురు యువతులు బుల్లెట్‌లు నడుపుతూ ఈ ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతపల్లిలో ఎంపీపీ బంక జయలక్ష్మి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, బంక అప్పారావు ,బళ్ళ నాని, అర్జున్, జాజుల దుర్గారావు, ఎంపీటీసీ యడ్లపల్లి మార్త, ఆరెళ్ళ లక్ష్మి, యజ్జవరపు లక్ష్మి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. నల్లజర్ల నుంచి కారుమంచి, మద్దిపాటి రమేష్, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తరలి వెళ్లాయి. పోతవరం నుంచి పెండ్యాల హరే రామకృష్ణ, ముప్పిడి వెంకటరత్నం, పిచ్చుకల ప్రసాద్, సర్పంచ్ నూతికుర్తి లక్ష్మణరావు, ఎంపీటీసీలు పాపా నాగేశ్వరరావు, చిడిపి చింతయ్య ఆధ్వర్యంలో భారీగా తరలి వెళ్లారు. అలాగే సింగరాజుపాలెం, జగన్నాథపురం, ఘంటావారిగూడేల నుంచి కూడా ఆ గ్రామాల నాయకుల ఆధ్వర్యంలో వనిత నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ర్యాలీగా తరలి వెళ్లారు.



ప్రకాశరావుపాలెం బైక్ ర్యాలీలో బుల్లెట్ రైడింగ్ చేస్తున్న ఐదుగురు యువతులు

గోపాలపురంలో నా గెలుపు ఖాయం

అభ్యర్థి తానేటి వనిత ధీమా



గోపాలపురంలో మీడియాతో మాట్లాడుతున్న తానేటి వనిత

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ శ్రేణుల ఉత్సాహాన్ని చూస్తుంటే మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తన గెలుపు ఖాయమని ఆ పార్టీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ధీమా వ్యక్తం చేశారు. గోపాలపురంలో శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన తర్వాత మంత్రి వనిత మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు ఉత్సాహంగా, స్వచ్ఛందంగా తన నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని విపక్ష కూటమి నేతల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారన్నారు. పార్టీ శ్రేణులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఉత్సాహం, పట్టుదలతో ప్రతి ఒక్కరూ పనిచేసి మే నెల 13న జరగనున్న పోలింగ్‌లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎంత బలంగా ఉందో చెప్పడానికి గురువారం నాటి భారీ ర్యాలీనే నిదర్శనమని ఆమె అన్నారు. ఎండ తీవ్రతను సైతం లెక్క చేయకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నట్టు చెప్పారు. ఇతర పక్షాలతో జత కట్టడాన్ని బట్టే ఈ ఎన్నికల్లో టీడీపీ బలమెంతో తెలుస్తోందన్నారు. జనన్నపై ప్రజల్లో అభిమానం ఉందని, ఈ రాష్ట్రానికి జగనన్న మరలా ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆమె అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) డాక్టర్ తానేటి శ్రీనివాసరావు, రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

- ఆ పార్టీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- చాగల్లులో ఇంటింటా ప్రచారం



చాగల్లు ప్రచారంలో వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు

చాగల్లు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి తిరుగులేని విజయం ఖాయమని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు ధీమా వ్యక్తం చేశారు. ప్రజాశీర్వాదం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చాగల్లులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి తలారి వెంకట్రావు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. స్థానిక మహిళలు హారతులిచ్చి తలారికి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఏ గడపకు వెళ్లినా చిరునవ్వులతో తమను ఆహ్వానిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయంటూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రచారంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండల అధ్యక్ష ,గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, పార్టీ కొవ్వూరు మండల శాఖ అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, జాలెం వెంకట్రావు, గెడా శ్యామ్, చీలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ పరిశీలకుడి తనిఖీలు



నిడదవోలు ఆర్వో కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న రోహిత్‌కుమార్

నిడదవోలు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఎన్నికల వ్యయ పరిశీలకుడు రోహిత్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం నిడదవోలు ఆర్వో కార్యాలయానికి వచ్చిన ఆయన ఇక్కడి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రోహిత్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్టు, పాలంగి, పెరవలి గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను తనిఖీ చేశామన్నారు. తరచూ తిరిగే వాహనాలపై నిఘా పెట్టాలని చెక్‌పోస్టుల సిబ్బందిని ఆదేశించామన్నారు. వివిధ వాహనాల రాకపోకలపై నిఘా పెట్టాలని కూడా వారికి ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. విలేకరులతో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమణ నాయక్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రత్యేక నామినేషన్ సెల్ (హెల్ప్ డెస్క్) ఏర్పాటు చేశామని చెప్పారు. చెక్ పోస్టుల వద్ద ఎక్సైజ్, పోలీసు, అటవీ, రెవెన్యూ తదితర శాఖల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. నామినేషన్లు స్వీకరించే గదిలో వీడియో రికార్డు చేస్తున్నామన్నారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం. భానుప్రకాష్, అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.శ్రీనివాస్, లైజాన్ అధికారి కె. కిషోర్ కుమార్, ఏఈఆర్‌ఓలు వి. నాగభూషణం , కె.నవీన్ కుమార్, డి.సుధ తదితరులు పాల్గొన్నారు.

బసివిరెడ్డిపేటలో ముమ్మర ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, పార్టీ శ్రేణులు

నిడదవోలు: మీ ఇంట్లో మంచి జరిగి ఉంటేనే జగనన్నను మరోసారి ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 12వ వార్డు బసివిరెడ్డిపేటలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి, ఐదేళ్లుగా ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడిని, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ల విజయానికి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, కార్యదర్శి గాజుల రంగారావు, కౌన్సిలర్లు మేడపాటి సరితాదేవి, కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, పువ్వల రతీదేవి, పార్టీ నాయకులు ఎస్‌కే చాన్‌బాషా, గంగుల గోపి యాదవ్, అడపా రాజు, మేడపాటి రాంబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తండ్రి తరఫున వరుణ్‌సాయి విస్తృత ప్రచారం



కె.సావరంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడి కుమారుడు వరుణ్‌సాయి

ఉండ్రాజవరం: ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఆ పార్టీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడి తనయుడు వరుణ్ సాయి విజ్ఞప్తి చేశారు. తండ్రికి మద్దతుగా శుక్రవారం వరుణ్‌సాయి మండలంలోని కె.సావరం గ్రామంలో రెండో రోజు కూడా ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. తన తండ్రి శ్రీనివాస్ నాయుడు ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్ నెస్ సెంటర్లతో పాటు నాడు–నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. మే 13న జరిగే సార్వత్రి ఎన్నికల్లో తన తండ్రి శ్రీనివాస్‌నాయుడికి, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, బస్వా రామన్నరావు, మీసాల సురేష్, బస్వా వీరరాఘవులు, సఖినాల వెంకటేశ్వరరావు, బస్వా శ్రీనివాసు, వగ్రే రమేష్, సీతాల శ్రీనివాస్, బస్వా సర్వేశ్వరరావు, నార్ని దుర్గారావు, బస్వా జగన్, ఉన్నమట్ల అయ్యప్ప, బస్వా బాలాజీ పాల్గొన్నారు.

నిడదవోలు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడిని గెలిపించాలని కోరుతూ ఆయన కుమారుడు వరుణ్ సాయి పట్టణంలోని 1వ వార్డులో శుక్రవారం ఇంటింటికీ వెళ్ళి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తన తండ్రి శ్రీనివాస్‌నాయుడిని, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో మునిసిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, దిరిసిన రామచంద్రరావు, పార్టీ నాయకులు గుర్రం జేమ్స్, అప్సర్ జానీ, వంగా నాగేశ్వరరావు, ఎండీ ఫయాజ్, ఎస్‌కే జాకీర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలో ప్రచారం చేస్తున్న శ్రీరమేష్

సమిశ్రగూడెంలో గజ్జరపు శ్రీరమేష్ ప్రచారం

నిడదవోలు రూరల్: సీఎం జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యేగా సమిశ్రగూడెంలో జి.శ్రీనివాసనాయుడు చేసిన అభివృద్ధిని చూసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఆ పార్టీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ కోరారు. సమిశ్రగూడెంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడులకు మద్దతుగా శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేయాలని కోరారు. ఈ ప్రచారంలో ఆ పార్టీ నాయకులు కస్తూరి సాగర్, కొత్తపల్లి సత్యనారాయణ, దేశాబత్తుల నాగు, వడలి అంబేద్కర్, గెడ్డం రవీంద్ర, ఆరుగొలను రమేష్, షేక్ రహీం, సయ్యద్ బాజీ, నజీరుద్దీన్‌ఖాన్, సునీల్, జిన్నా, నల్లమాటి నరేంద్ర పాల్గొన్నారు.

బోర్‌వెల్ నుంచి వదిలిన మురుగునీటి వల్లే సమస్య

నిడదవోలు: స్థానిక పెద్ద మసీదు సమీపంలో కొత్తగా వేసిన బోర్ వెల్ నుంచి మురుగునీటిని వదలడం వల్ల పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్లోని ప్రధాన రోడ్డు నీట మునిగిందని మున్సిపల్ కమిషనర్ టి.రాంభూపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పెద మసీదు సమీప అంగన్‌వాడీ కేంద్రం వద్ద బోర్‌వెల్ పనులు చేపట్టామన్నారు. బోర్ వెల్ నుంచి వస్తున్న ఇసుక, మట్టి ప్లంబింగ్ చేయడంలో భాగంగా సిబ్బంది మురుగునీటిని డ్రైనేజీలోకి వదిలారని వివరించారు. బోర్‌వెల్ నుంచి నీరు అధికంగా రావడంతో ఊహించిన విధంగా డ్రైనేజీలు పొంగి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ప్రధాన రోడ్డుపైకి మురుగు నీరు వచ్చి చేరిందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించామని ఎటువంటి ఇబ్బందులు లేవని ఆయన పేర్కొన్నారు. ఈ అలసత్వానికి కారణమైన బోర్‌వెల్ దగ్గర పని చేస్తున్న సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి చెప్పారు.

స్తంభాన్ని ఢీకొన్న స్కూటీ

ముగ్గురు యువకులకు గాయాలు



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నల్లజర్ల: అనంతపల్లి శివారు వీరవల్లి టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. నల్లజర్లకు చెందిన కలపాల సాగర్, గణేష్, గొన్నూరి పండు అనే వారు గోపాలపురంలో జరిగే నామినేషన్ కార్యక్రమానికి వెళ్లి తిరిగి నల్లజర్ల వస్తున్నారు. వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద వారు ప్రయాణిస్తున్న స్కూటీ విద్యుత్తు స్తంభాన్ని బలంగా ఢీ కొట్టింది. స్కూటీ రెండుముక్కలైంది. ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులకూ తీవ్ర గాయాలయ్యాయి. వారిని తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో పరిస్థితి విషమంగా ఉన్న సాగర్‌ను మెరుగైన చికిత్స కోసం కాకినాడ ఆసుపత్రికి తరలించనున్నట్టు సమాచారం. ప్రమాదవార్త తెలియగానే నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, విద్యాకమిటీ చైర్మన్ నీరుకొండ జయకృష్ణ ప్రభుత్వాసుపత్రికి వెళ్ళి క్షతగాత్రులకు అందిస్తున్న వైద్యం గురించి ఆరా తీశారు.

గాయపడిన మహిళ మృతి



నామాల నిర్మల (ఫైల్)

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట గ్రామంలో బుధవారం గ్యాస్ లీకైన దుర్ఘటనలో కాలిన గాయాలైన నామాల నిర్మల (39) చికిత్స పొందుతూ శుక్రవారం ఆసుపత్రిలో మృతి చెందింది. ఈ ఘటనలో నిర్మలతో పాటు ఆమె కుమారుడు, కుమార్తెలకు కూడా గాయాలయ్యాయి. పరిస్థితి ప్రమాదకరంగా ఉన్న నిర్మలను మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ చెప్పారు. కాగా మృతురాలి పిల్లలిద్దరూ కోలుకుంటున్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై సిబ్బందికి అవగాహన

తాళ్లపూడి: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ తీసుకుని సకాలంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యే వివిధ బృందాల్లోని మండల, బూత్ లెవెల్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్ ఎలా వేయాలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఫాం- 12 దరఖాస్తులను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. వాటిని పూర్తి చేసి సకాలంలో అందజేయాలన్నారు.ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే వారికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్‌వో జె. వెంకటేశ్వరరావు, ఎఈవోలు సీహెచ్ బాలామణి, సీహెచ్ నెహ్రూజీలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నేడు, రేపు గరికపాటి ఆధ్యాత్మిక ప్రవచనాలు

కొవ్వూరు: ఈనెల 20, 21 తేదీల్లో సాయంత్రం ఐదున్నర నుంచి రాత్రి 8 గంటల వరకూ మహా సహస్రావధాని, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు స్థానిక సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. కావున భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.